క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బుధవారం ట్రాన్స్‌కో ఏఈ పి. మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రగూడెం నుంచి వచ్చే 11కేవి ఫీడర్11కేవి బూపాస్‌ఈడర్, 11కేవీ ఇండస్ట్రియల్ వన్ ఫీడర్1 ఫీడర్2, యాద్గారపల్లి ఏజియల్ ఫీడర్ల లైన్ పనులు జరుగుతున్నందున రామచంద్రగూడం, తాళ్లగడ్డ, ఏడుకోట్ల తండా, రాజీవ్‌నగర్, బైపాస్, భాగ్యనగర్ కాలనీ, శ్రీనిధి కాలనీ, రాంనగర్, చౌదరికాలనీ, చైతన్యనగర్ పరిసర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

డిండి: ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని నగారాదుబ్బతండాలో కరంటోతు అచ్చికి సంబంధించిన ఇల్లు కూలింది. కాగా బుధవారం ప్రభుత్వ నుంచి వచ్చిన రూ.8 వేలు నష్ట పరిహారం కింద బాధితురాలికి తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ అందజేసారు. ఆయన వెంట ఆర్ఐ.వెంకటేశ్వర్లు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డిండి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నిరోధకంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ.బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాల ప్రమాదాలు, వాటి పరిమాణాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు ఎస్ఐ వివరించారు. సైబర్ నేరాగాళ్లకు మోసపోకుండా జాగ్రత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాండురంగయ్య, అధ్యాపకులు సంతోష్‌కుమార్, కృష్ణయ్య, హన్మంతు, శ్రీరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మొసలి ప్రత్యక్షం



నడిగడ్డ గ్రామంలో మొసలి

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి మండలం నడిగడ్డ గ్రామంలోని టెయిల్‌పాండ్ బ్యాక్ వాటర్‌లో బుధవారం మొసలి కనిపించింది. దీంతో స్థానిక ప్రజలు భయందోళనకు గురయ్యారు. గ్రామానికి బ్యాక్ వాటర్ రావడంతో విషపు పురుగులు వచ్చి చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొసలి వచ్చిన విషయాన్ని స్థానికులు అధికారులకు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

దేవరకొండ : ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని దేవరకొండ ఆర్డీఓ రమణా రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌పరిధిలోని ఆయా మండలాల ఎంపీడీఓలు, పట్టణ మున్సిపల్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ, కమిషనర్ తదితరులు పల్గొన్నారు.

సేంద్రియ పద్ధతి సాగుతోనే అధిక దిగుబడులు

పెద్దవూర : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగుతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు రాబట్టవచ్చునని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త ఎండీ.లతీఫ్ పాషా అన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పర్వేదుల, ఊట్లపల్లి గ్రామాలలో సాగు చేస్తున్న విత్తన వరి సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నానో యూరియా, డీఏపీలపై రైతులకు అవగాహన కల్పించారు.

జాతీయ సమైక్యత దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నేతలు

హాలియా : పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు ఉన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సెప్టెంబర్ 17న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ, దేవరకొండ, నియోజకవర్గాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మిర్యాలగూడ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



మిర్యాలగూడ : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్‌కమిషనర్



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తహసీల్దార్ కార్యాలయం వద్ద..



అడవిదేవులపల్లిలో..



మిర్యాలగూడ : కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయజెండాను ఎగుర వేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



నాగార్జునసాగర్ : డ్యాం సర్కిల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న డీఎస్ఈ



నిడమనూరు : తహసీల్దారు కార్యాలయంలో..



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పోలీస్‌స్టేషన్‌లో..



నాగార్జునసాగర్ : గురుకుల విద్యాలయంలో..



పెద్దవూర : పీహెచ్‌సీ వద్ద..



డిండి: తహసీల్దార్ కార్యాలయంలో



మిర్యాలగూడ టౌన్ : మండల పరిషత్ కార్యాలయంలో..



హాలియా : మున్సిపల్‌కార్యాలయంలో..



వేముపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో..



త్రిపురారం : ఎంపీడీఓ కార్యాలయంలో..



హాలియా : పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద..

రైతులందరికీ యూరియా అందిస్తాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : జిల్లాలోని రైతులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాల శ్రవణ్ కుమార్ అన్నారు. మండలంలోని డొక్కలబావితండా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి యూరియా పంపిణీని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా నాగార్జునసాగర్ నియోజవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట హాలియా ఏడీఏ సరిత, ఏఓ హర్షిత ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

నిడమనూరు : ప్రభుత్వం ప్రజాపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించకుండా ఉన్న వెంకటాపురం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు పలువురు బుధవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన రోజును స్థానిక కార్యదర్శి హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆరోపించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని స్థానిక యువకులు గుర్తు చేస్తే, అప్పుడు ఆలస్యంగా స్పందించిన కార్యదర్శి తాను రాలేనని పంచాయతీ కార్మికులతో జెండా ఆవిష్కరించారు. కనీసం గ్రామ పెద్దలను కూడా ఆహ్వానించకుండా, అవమానపరిచారని వారు పేర్కొన్నారు. ఘనంగా నిర్వహించాల్సిన ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్లక్ష్యం వహించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కే దేవందర్, సీ హెచ్ భిక్షం, వెంకన్న తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం



విమోచన దినోత్సవంలో బీజేపీ నేతలు

దేవరకొండ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్,జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్, గుండాల అంజయ్య, నేతాళ్ల వెంకటేష్, ఇడెం రవి, రవిప్రసాద్, ఫణి, బిక్కు, తదితరులున్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ శక్తివంతమవుతుందని తద్వార వికసిత భారతానికి ఆధారమవుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి మాతృవందన పథకంలో భాగంగా నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. మహిళలకు అక్టోబర్ 2వ తేదీ వరకు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని, ప్రభుత్వం అందించే ఉచిత వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ, కంటి పరీక్షలతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను సైతం వైద్య నిపుణులు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పుట్టల శ్రీనివాస్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ సమరధ్, డీటీసీఓ కళ్యాణ్‌చక్రవర్తి, ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ అరుంధతి, సీడీపీఓ మమత, వైద్య సిబ్బంది తిరుపతయ్యతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 2వరకు స్వస్థ్ నారీ అభియాన్

పెద్దవూర: దేశంలోనే అతిపెద్ద మహిళా, శిశు ఆరోగ్య సమీకరణ డ్రైవ్‌గా పేర్కొనే స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రముఖ డెర్మటాలజిస్ట్ అనితా రాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నగేష్, డాక్టర్ ఉదయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ మహా యజ్ఞం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జర్నలిస్టు కాలనీలో శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ యూనియన్ భవనంలో బుధవారం శ్రీవిరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. గుంటిపల్లి రవీంద్రాచార్యులు వేద మంత్రోత్సవాల మధ్య అంగరంగా వైభవంగా మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేశారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుడి శోభాయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కమిటీ చైర్మన్ పామోజు సోమాచారి, వైస్ చైర్మన్ బంధనకంటి హనుమాచారి, అధ్యక్షులు కొండోజు మల్లిఖార్జునచారి, రామాచారి, వెంకటాచారి, వెంకటరమణచారి, లక్ష్మినారాయణ, రమేష్‌చారి, మధుశంకర్, బ్రహ్మచారి, సురేష్, నాగేంద్రాచారి, నాగాచారి, వెంకటాచారి, సత్యనారాయణచారి తదితరులున్నారు. అదే విధంగా పట్టణంలోని శివాలయంలో బుధవారం స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహా యజ్ఞంకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూజలు నిర్వహించారు. లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలో గల శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మంద్రస్వామి ఆలయంలో మహాయజ్ఞం నిర్వహించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు.



మిర్యాలగూడ టౌన్ : మహాయజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నిడమనూరు : విశ్వకర్మ జయంతిని నిడమనూరులో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ యజ్ఞం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథుల రాణి రమేష్, తుడిమళ్ల సైదాచారి, రాములు, కొండోజు కృష్ణమాచారి, జిల్లెపల్లి శంకర్‌చారి, కాలే వసంతరావు, గాయకవాడ లక్ష్మినారాయణ, ఉన్నం సీతారాములు, నరసింహాచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వసుకుల మట్టయ్య అన్నారు. బుధవారం వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వస్కుల సైదమ్మ, ధీరావత్ మోహన్‌నాయక్, మచ్చ సైదులు, రమేష్, రామాంజి, జ్యోతి, మంద మల్లేష్, ఏవూరి రవి, గడ్డి వీరయ్య, బాలయ్య, కమలమ్మ, గురువయ్య, శీను, మౌనిక, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి ప్రాణదానం

మిర్యాలగూడ అర్బన్ : నేత్ర దానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారాని ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని అశోకనగర్‌కు చెందిన అల్లాని వెంకయ్య మృతచెందగా ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో డైమాండ్ నేత్రనిధి ద్వారా నేత్రాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ కంటి ఆస్పత్రికి అందించినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైమాండ్ నేత్ర నిధి సభ్యులు సామా శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్, అల్లాని ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రమేష్, నేత్ర నిధి టెక్నీషియన్ బచ్చలకూర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే



దేవరకొండ సీపీఐ కార్యాలయంలో జాతీయజెండా ఎగురవేస్తున్న దేవేందర్‌రెడ్డి

దేవరకొండ: తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అమరుల జీవిత చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవ సుదర్శన్‌రెడ్డి,నూనె రామస్వామి,వలమల్ల ఆంజనేయులు, అనిత, రంగారెడ్డి, కిన్నెర యాదయ్య, వెంకటయ్య, మైనొద్దీన్, వెంకటేశ్వరరావు, జ్యోతిబసు, తదితరులున్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 306మంది అర్హులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1కోటి 13లక్షల విలు వైన చెక్కులను పంపిణీ చేశారు. ఆపద సమయాల్లో సీఎం సహాయనిధి ఆపన్నహస్తం అందిస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయిని జమునామాధవరెడ్డి, మారుపాకల సురేష్‌గౌడ్, ముక్కమల్ల వెంకటయ్య, బిక్కునాయక్, దూదిపాళ్ల రేఖ, వేమన్‌రెడ్డి, రహత్‌అలీ, కొర్ర రాంసింగ్, తదితరులున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

దేవరకొండ పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ 34వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్, మారుపాకుల సురేష్ గౌడ్, ముక్కు మళ్ల వెంకటయ్యాగౌడ్, ఎస్ ఎన్‌చారి, తదితరులున్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

మిర్యాలగూడ : ప్రజా సంక్షేమం, రెవెన్యూ శాఖల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని జీపీఓలు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో కొత్తగా నియామకమైన జీపీఓలకు ఈనెల 17 నుంచి 19 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ పాల్గొని జీపీవోలకు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా అంకితభావంతో, నిజాయితీతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్లు సురేష్, కృష్ణయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

రైతులను వెంటాడుతున్న యూరియా కష్టాలు



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : సబ్‌మార్కెట్ యార్డు వద్ద టోకెన్ల కోసం బారులుదీరిన రైతులు



కొండమల్లేపల్లి : యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని స్థానిక సహకార వ్యవసాయ కేంద్రం ఆవరణలో రైతులు యూరియా కోసం ఉదయం 5గంటల నుంచి తమ చెప్పులను క్యూలైన్‌లో ఉంచారు. స్థానిక వ్యవసా య అధికారి జానకి రాములు కేంద్రంలో ఉన్న యూరియాను రైతులకు టోకెన్ల ద్వారా అందజేశారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులకు యూరియా కష్టాలు తీరడంలేదు. బుధవారం పలు గ్రామాల నుంచి రైతులు యూరియా టోకెన్ల కోసం మండల కేంద్రంలో రైతు వేదిక వద్దకు ఉదయం 5గంటల నుంచి వచ్చి వరుసలో నిలబడ్డారు. రైతులు ఎక్కువగా రావడంతో పోలీసులు రైతులను అదుపు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండడంతో మహిళ రైతులు నిలబడి ఉన్న వరుసలో తోపులాట జరిగింది. దీంతో పలువురు మహిళ రైతులు స్పృహ కోల్పోయారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పటిష్ట భద్ర ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. బుధవారం తిరుమలగిరి(సాగర్) మండలానికి 60 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అందులో 40 మెట్రిక్ టన్నుల యూరియా తిరుమలగిరి రైతు వేదిక, 20 మెట్రిక్ టన్నుల యూరియాను డొక్కలబావితండా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేశారు. సమాచారం తెలుసుకున్న మండల రైతులు తెల్లవారు జామునసే వందల సంఖ్యలో పంపిణీ కేంద్రాల వద్దకు చేరుకొని బారులుదీరారు. ఒక్కో రైతుకు రెండు కట్టల చొప్పున సుమారుగా ఏడువందల మందికి పంపిణీ చేశారు. మిగతా రైతులకు అందకపోవడంతో వందల సంఖ్యలో రైతులు వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది.

నిడమనూరు : అధిక ధరలకు యూరియా విక్రయాలపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. నిడమనూరు మండలంలో బుధవారం సహకార సంఘం, రైతు సేవా కేంద్రాలను కాదని,ఒక్క రోజు 80 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రవేటు డీలర్ల నుంచి విక్రయించడంతో రైతులు ఆ ఎరువుల దుకాణానికి, ఈ దుకాణానికి పరుగుతు తీశారు. ఫర్టిలైజర్ దుకాణాల వద్ద యూరి యా రాగానే జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి వెంట పెద్ద సంఖ్యలో రైతులు బారులుదీరారు.



నిడమనూరు : ఎరువుల దుకాణం వద్ద..